ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5



పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
శనివారం 30 ఆగస్టు 2025

## ముగిసిన డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

విజయనగరం కలెక్టరేట్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో మెగా డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన శుక్రవారం ముగిసింది. రెండోరోజు శుక్రవారం 207 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. డెంకాడ మండలం మోదవలసలోని ఓ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ ప్రక్రియ ప్రారంభించిన సంగతి తెలిసిందే. మొత్తం 583 పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు సంబంధించిన ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిందని విజయనగరం జిల్లా విద్యాశాఖాధికారి మాణిక్యంనాయుడు తెలిపారు.

# తెలుగును పరిరక్షించుకోవాలి



గిడుగు చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్

● కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళి అర్పించారు. సామాన్యుల వాడుక భాషలో గ్రంథ రచన జరగాలని ఉద్యమించిన మహనీయుడు రామమూర్తి అని కొనియాడారు. ఈ ప్రాంతానికి చెందిన గిడుగు జయంతి రోజున తెలుగు భాషా దినోత్సవం నిర్వహించుకోవడం అందరికీ గర్వకారణమన్నారు. గిరిజన సవర భాషకు ఆయన లిపిని కూడా అందించారని, భాష పేరుతో మన్యంలో దేవాలయం ఉండడం గొప్ప విషయమని వెల్లడించారు. తెలుగు వికాసానికి పాటుపడిన కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తి వంటి వారి చరిత్రలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. విద్యార్థుల కోసం వచ్చే నెల 5న తెలుగు మాసప త్రికను విడుదల చేయనున్నామని, అందులో



నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్న విద్యార్థినులు

వారి అవసరమైన సమాచారంతో పాటు రచనలు ఉంటాయని తెలిపారు. తొలుత తెలుగు భాష విశిష్టతపై రచయితలు జి.గౌరునాయుడు, చింతా అప్పలనాయుడు, మల్లిపూడి జగదీశ్వరరావు కవితలను వినిపించగా, జిల్లా వ్యవసాయ శాఖాధికారి రాబర్ట్‌పాల్ గీతాన్ని ఆలపించారు. అనంతరం కవులు, రచయితలను కలెక్టర్ సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు నృత్య ప్రదర్శనలతో అలరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి వై.నాగేశ్వరరావు, డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

### ప్రాధాన్య అంశాలపై అవగాహన తప్పనిసరి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ప్రభుత్వ పథకాలు, ప్రాధాన్య అంశాలపై పూర్తిగా అవగాహన ఉండాలని కలెక్టర్ జిల్లా రెవెన్యూ అధికారులకు సూచించారు. అన్ని శాఖల కంటే రెవెన్యూ శాఖ పాత్ర కీలకమన్నారు. ప్రజలకు అవసరమైన అన్ని పత్రాలను (మిగతా 8వ పేజీలో...)



రచయితలు, కవులను సత్కరించిన కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

## రెండు స్టేషన్లూ కొనసాగించండి

● ఈస్ట్‌కోస్టు రైల్వేజోన్ కమిటీ సమావేశంలో కోరిన ఎమ్మెల్యే విజయచంద్ర
● హైదరాబాద్, తిరుపతికి నేరుగా రైళ్లు నడపాలని వినతి
● రిజర్వేషన్ కౌంటర్లు, వంతెన, హాల్టింగ్ సౌకర్యంపై ప్రతిపాదనలు

పార్వతీపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు సౌకర్యార్థం, వారి మనోభావాలు, సరుకు రవాణా ప్రాధాన్యతను గుర్తించి పార్వతీపురంలో యథావిధిగా రెండు రైల్వే స్టేషన్లను కొనసాగించాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కోరారు. ప్రజలకు ఇబ్బందులు లేని విధంగా విలీన ప్రక్రియ చేపట్టాలన్నారు. భువనేశ్వర్‌లో శుక్రవారం జరిగిన రైల్వేజోనల్ కమిటీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈస్ట్‌కోస్టు రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్, రైల్వే ఉన్నతాధికారులను కలిశారు. ఒడిశా-ఛత్తీస్‌గఢ్ రైల్వే అనుసంధా నంలో పార్వతీపురం కీలకపాత్ర పోషిస్తుందని, అయితే



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

సరిపడా రైళ్లు లేక ఈ ప్రాంతవాసులు విశాఖ నుంచి ప్రయాణాలు చేయాల్సి వస్తోందని తెలిపారు. పార్వతీపురం-విశాఖపట్నం (మిగతా 8వ పేజీలో...)

## పట్టాలు తప్పిన గూడ్స్

● విజయనగరంలో ఘటన ● రెండు బోగీలు పూర్తిగా ధ్వంసం
● పలు రైళ్ల రాకపోకల్లో ఆలస్యం ● ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు



విజయనగరం/ క్రైం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): బియ్యం లోడుతో వెళ్తున్న గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. నాగపూర్ నుంచి కాకినాడ పోర్టుకి బియ్యం లోడుతో వెళ్తున్న గూడ్స్ విజయనగరం రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం దాటిన వెంటనే శుక్రవారం ఉదయం సుమారు 6.30 గంటల ప్రాంతంలో రైల్వే బ్రిడ్జి సమీపంలో పట్టాలు తప్పింది. దీంతో రెండు బోగీలు పూర్తిగా ధ్వంసంకాగా, మూడు బోగీలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. రైల్వే విద్యుత్ లైనుతో పాటు ట్రాక్ పూర్తిగా దెబ్బతింది. సమాచారం అందుకున్న డీఆర్ఎం లలిత్‌బోరాతో పాటు సీనియర్ అధి కారులు, ఇంజనీరింగ్, కమర్షియల్, మెంటేనెన్స్ అధికారులు సంఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకున్నారు. భారీ ప్రొక్లైనర్లతో వ్యాగన్‌లను పక్కకు తీశారు. లోపల ఉన్న బియ్యాన్ని కూలీలతో పక్కనే ఉన్న రైల్వే ట్రాక్ పక్కన నెట్టుగా వేయించారు. కూలీలను భారీ ఎత్తున తీసుకువచ్చి రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. శుక్రవారం రాత్రి ఏ సమయానికైనా ట్రాక్‌ని పూర్తిగా పునరుద్ధరించే విధంగా చర్యలు చేపడుతున్నారు. తక్కువ స్పీడ్‌తో వెళ్లడంతో భారీ నష్టం తగ్గిందని అధికారులు చెబుతున్నారు. ఆ సమయంలో పక్కనుంచి ఏ ఇతర ప్యాసింజర్ ట్రైన్‌లు ప్రయాణించక పోవటంతో పెద్దప్రమాదం తప్పినట్లు అయిందన్నారు. రైల్వే లైను మరమ్మతులు పనులు కొనసాగుతుండడంతో పక్కన ఉన్న మరో ట్రాక్‌పై రైళ్ల రాకపోకలు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. దీంతో పలు రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలురైళ్లు ఆలస్యంగా నడుస్తుండగా, మరికొన్ని రైళ్లని అధికారులు రద్దు చేశారు. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు.

### సాంకేతిక లోపమే కారణమా?

గూడ్స్ రైలు పట్టాలు తప్పడానికి సాంకేతిక కారణమా? అన్న రీతిలో రైల్వే అధికారులు విచారణ చేపడుతున్నారు. సీనియర్ మెకానికల్ ఇంజనీర్లు, సాంకేతిక రైల్వే నిపుణులతో కలసి ట్రాక్‌ని పరిశీలిస్తున్నారు. ఇటీవల ఈ రైల్వే స్టేషన్ సమీపంలోనే ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పడం, తాజాగా అలాంటి సం ఘటనే జరగడంతో రైల్వే అధికారులు ఈ విషయాన్ని నిశితంగా పరిశీలిస్తున్నారు. తాజా ఘటన కారణంగా రూ.3 కోట్లు నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు.

### ఆలస్యంగా నడిచిన రైళ్లు ఇవే..

ధనబాద్-అలెప్పి(13351) మూడు గంటలు, టాటా-యశ్వంత్ పూర్(18111) నాలుగు, హౌరా-బెంగళూరు(12867) మూడు, భువనేశ్వర్-బెంగళూరు(18463) నాలుగు, శాలిమార్-వాస్కోడిగామా (18047) ఐదు గంటలు ఆలస్యంగా నడిచాయి.

### రద్దయినవి ఇవే..

విజయనగరం-విశాఖ పాసింజర్(67288), విశాఖపట్నం-పలాస పాసింజర్(67289), పలాస-విశాఖపట్నం(67290), విశాఖ-కొరాపుట్ పాసింజర్ ( 58538), కొరాపుట్-విశాఖపట్నం( 58537) రైళ్లు రదయ్యాయి.

## మమ్మల్ని ఆదుకోండయ్యా!

● నూతన పింఛన్ల కోసం వితంతువుల ఎదురుచూపు ● గత ఏడు నెలలుగా పనిచేయని వెబ్‌సైట్
● ఇబ్బందుల్లో వందలాదిమంది ● ప్రభుత్వం స్పందించాలని వేడుకోలు



జియ్యమ్మవలస, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలువురు వితంతువులు నూతన పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. గత ఏడెనిమిది నెలల్లో భర్తను కోల్పోయిన వారు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయితే ఆన్‌లైన్ వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని వెల్ఫేర్ అసిస్టెంట్లు చెప్పడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం స్పౌజ్ కోటా కింద ఇస్తున్నట్లుగానే తమకూ పింఛన్లు మంజూరు చేయాలని వారు వేడుకుంటున్నారు. వాస్తవంగా జిల్లాలోని 15 మండలాల్లో మొత్తం 1,40,073 మందికి పింఛన్లు అందుతున్నాయి. వారిలో వృద్ధులు, నేత కార్మికులు, దివ్యాంగులు, వితంతువులు ((స్పౌజ్ కోటా), కల్లు గీత కార్మికులు, ట్రాన్స్ జెండర్స్, మత్స్య కారులు, ఒంటరి మహిళలు, చెప్పులు కుట్టేవారు, డప్పు వాయించేవారు, కళాకారులు, కిడ్నీ బాధితులు తదితరులు ఉన్నారు. పింఛన్ల పంపిణీ కోసం ప్రభుత్వం ప్రతి నెలా సుమారు రూ. 59.84 కోట్లు మంజూరు చేస్తోంది. కాగా ఎన్టీఆర్ భరోసా కింద పింఛన్ మంజూరు చేయాలని వితంతువులు సచివాలయాలకు వెళ్తే ఆన్‌లైన్ సైట్ పూర్తిగా క్లోజ్ చేసేశారని అక్కడున్న సిబ్బంది చెబుతున్నారు. దీంతో వారు ఈసురోమంటూ వెనుదిరగాల్సి వస్తోంది. పింఛన్ పొందుతున్న భర్త చనిపోతే వెంటనే ఆయన భార్యకు (స్పౌజ్) పింఛన్ మంజూరు చేస్తున్నారు. కానీ వితంతు వులకు మాత్రం పింఛన్ మంజూరుకు దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జియ్యమ్మవలస మండలం పెదతోలుమండ పంచాయతీ లోని పీటీ మండ, చాపరాయిగూడ, దీసరిగూడ, బాపన్నగూడ, నడిమిసిరిపి, పల్లపుసిరిపి గిరిజన గ్రామాల్లో దాదాపు 30 మంది వితంతువులకు పింఛన్లు రాలేదు. చినమేరంగిలోని దళితవాడలో నలుగురు, కొండచిలకాం, అలమండ, టీకే జమ్ము పంచాయతీల్లో సుమారు 50 మంది వరకు వితంతువులకు పింఛన్లు రాలేదు. ఇలా చెప్పుకుంటూ పోతే జిల్లాలో వందలాది మంది అర్హులైన వితంతువులు ఉన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పం దించి తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

### ఆదేశాలొస్తే చర్యలు తీసుకుంటాం..

వితంతు పింఛన్ల మంజూరు విషయంలో ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నాం. ఉత్తర్వులు వస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.
- సుధారాణి, డీఆర్‌డీఏ పీడీ, పార్వతీపురం మన్యం జిల్లా

## పింఛన్ల పంపిణీకి సన్నద్ధం

పార్వతీపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా సెప్టెంబర్ ఒకటో తేదీన పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధం చేయాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీపై శుక్రవారం డీఆర్‌డీఏ, మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.



పింఛన్ల పంపిణీపై ఎక్కడా ఎటువంటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. నోటీసులు అందుకున్న దివ్యాంగ పింఛన్ దారులు ఆన్‌లైన్‌లో అప్పీల్ చేసుకోవాలని సూచించారు. నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరాలను పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

### అప్పీల్‌కు నేటితో ముగియనున్న గడువు

నోటీసులు అందుకున్న దివ్యాంగ పింఛన్‌దారులు ఈ నెల 30 సాయంత్రం 5 గంటల్లోగా ఆన్‌లైన్‌లో అప్పీలు చేయాలని డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి తెలిపారు. అర్హత కలిగిన వారికి ఒకటో తేదీన పింఛను పంపిణీ జరుగుతుందన్నారు.

## ఏజెన్సీలో లేఖ కలకలం

● సోషల్ మీడియాలో హల్‌చల్
● ఎస్పీ ఆకస్మిక తనిఖీ

6లో

## ప్రతిభ చూపితే రూ.24 వేల స్కాలర్‌షిప్

సాలూరు రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి విజ్ఞాన మంథన్ పరీక్షలో ప్రతిభ చూపితే ఏడాదికి రూ. 24 వేల స్కాలర్ షిప్ పొందొచ్చునని జిల్లా కోఆర్డినేటర్ కోట అయ్యప్ప చెప్పారు. శుక్రవారం స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ.. జాతీయస్థాయిలో ప్రతిభాన్వేషణకు గాను కేంద్ర సర్కారు ఈ పరీక్ష నిర్వహిస్తుందన్నారు. ఆరు నుంచి ఇంటర్మీడియట్ ప్రథమ ఏడాది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ రుసుం రూ. 200 చెల్లించి, వచ్చే నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు స్కాలర్ షిప్‌తో పాటు ప్రముఖ పరిశోధన సంస్థల్లో ఇంటర్న్‌షిప్, స్కాలర్ షిప్ పొందే అవకాశముంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 99484 42298 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.




## ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

6లో

## అప్రమత్తతే ఆరోగ్యానికి రక్ష

6లో

## ఆకట్టుకుంటున్న గణనాథులు



6లో

## 3న జాబ్‌మేళా

పార్వతీపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో వచ్చే నెల 3న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సాయి కృష్ణచైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ ఏదైనా డిగ్రీ చదువుకున్న 18 నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. పది కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఉదయం 9 గంటలకు శ్రీసాయిరామ్ డిగ్రీకాలేజ్‌కు రావాలని సూచించారు. ముందుగా అభ్యర్థులు తమ వివరాలను హెచ్‌టీటీపీఎస్‌:// ఎన్ఏపీయూ ఎన్‌వైఏఎం. ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. రిఫరెన్స్ నెంబర్‌తో పాటు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు, పాస్‌పోర్టుసైజ్ ఫొటోతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 91772 97528, 89788 78557 నెంబర్లను సంప్రదించాలన్నారు.

## నేడు లాటరీ పద్ధతిలో బార్ల కేటాయింపు

పార్వతీపురం టౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన బార్ పాలసీ అప్లికేషన్ల గడువు శుక్రవారంతో ముగిసిందని ఉమ్మడి జిల్లాల ఎక్సైజ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం లాటరీ పద్ధతిలో బార్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 18 బార్లుకు కలెక్టర్ సమక్షంలో లాటరీ ప్రక్రియ జరుగుతుందన్నారు. విజయనగరం జిల్లాలో ఓపెన్ కేటగిరీలో 51, గీత కార్మికులకు చెందిన మూడు బార్లుకు 21 అప్లికేషన్లు వచ్చాయన్నారు. మన్యం జిల్లాలో ఓపెన్ కేటగిరీలో 9, గీత కార్మికులకు సంబంధించి 10 అప్లికేషన్లు స్వీకరించామని తెలిపారు.



## పార్వతీపురం ఎఫ్ఏసీ కమిషనర్‌గా శ్రీనివాసరాజు

పార్వతీపురం టౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మున్సిపాలిటీ ఎఫ్ఏసీ కమిషనర్‌గా శ్రీనివాసరాజును నియమిస్తూ సీడీఎంఏ అధికారి సంపత్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 8 నుంచి ఆయన ఇన్‌చార్జి కమిషనర్‌గా ఉన్నారు. తాజా ఆదేశాలతో ఎఫ్ఏసీ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించనున్నారు. పట్టణాభివృద్ధి, పరిపాలనకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తానని శ్రీనివాసరాజు వెల్లడించారు.

### మెప్మా ఇన్‌చార్జి పీడీగా కృష్ణారావు

మెప్మా ఇన్‌చార్జి పీడీగా బి.కృష్ణారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. తొలుత ఆయన కలెక్టర్‌ను కలిశారు. కాగా గతంలో ఆయన పాలకొండలో పనిచేశారు. ఇప్పటివరకు ఇక్కడ పీడీగా పనిచేసిన చిట్టిరాజు బదిలీపై విజయనగరం వెళ్లారు.

# అప్రమత్తతే ఆరోగ్యానికి రక్ష

● వర్షాకాలంలో జాగ్రత్తగా ఉండాల్సిందే..

చీపురుపల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి)

చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే అనారోగ్యాన్ని దూరంగా ఉంచొచ్చు. ముఖ్యంగా ఈ సీజన్‌లో వర్షాలు కురవడం వల్ల సాధారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఆరోగ్యం పట్ల కాస్త అప్రమత్తంగా ఉంటే రోగాలు బారిన పడి ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని వైద్యులు సూచిస్తున్నారు.



### పరిశుభ్రతే ప్రధానం..

ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలి. వాన నీరు నిల్వ ఉంటే దోమల లార్వా వృద్ధి చెందే ప్రమాదం ఉంటుంది. దీనివల్ల మలేరియా విజృంభణ, విష జ్వరాలు ప్రబలడం వంటివి ఎక్కువ అవుతాయి. ఇంటి ఆవరణలో ఉండే సిమెంట్ కుండీలు, నీటితొట్టెలు ఎప్పటికప్పుడు ఖాళీ చేసుకోవాలి. రెండు మూడు రోజులకొకసారి బ్లీచింగ్ పౌడర్ వేసి శుభ్రంగా కడగాలి. పారేసి న కొబ్బరి బొండాలు, టైర్లు, కూలర్లు, పూల కుండీలు, పగిలిపోయిన కుండలు, ప్లాస్టిక్ గ్లాసులు, సీసాలు, నీటి తొట్టెలు తదితర వాటి లో నీరు నిల్వ ఉండడం వల్ల డెంగీ, చికున్ గున్యా వంటి జబ్బులు వ్యాపించే ప్రమాదం ఉంది. దీంతో నీటి నిల్వ లేకుండా ఎప్పటి కప్పుడు చర్యలు తీసుకోవాలి.

### డ్రైడే పాటించాల్సిందే..

దోమల నివారణకు ఇళ్లలో ప్రతివారం డ్రైడే పాటించాలి. ఇంటి పరిసరాల్లో చేమ లేకుండా తగిన చర్యలు తీసుకోవాలి. ఇంటి ముందు లేదా సమీపంలో నీటి గుంతల్లో వాడుక నీరు గానీ, వర్షపు నీరుగానీ నిల్వ ఉండకుండా చూడాలి. పక్కాగా డ్రైడేను అమలు చేయాలి.

### తాగునీటి పట్ల జాగ్రత్తగా..

వర్షాకాలంలో క్లోరినేషన్ చేసిన నీటిని తాగాలి. పంచాయతీల పరిధిలో ఉన్న తాగు నీటి ట్యాంకులు ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నదీ లేనిదీ గమనించాలి. అంతకంటే ముఖ్యంగా వేడి చేసి, చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. పనిపై బయటకు వెళ్లే వారు విధిగా వేడి నీటిని తీసుకొని వెళ్లడం మంచిది.

### ఆహార నియమాలు..

ఉదయం, సాయంత్రం రెండు పూటలా వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలి. ఉదయం వండిన ఆహారాన్ని రాత్రి లేదా మరుసటి రోజున తీసుకోవడాన్ని వీలయినంతవరకూ నివారించాలి. నిలువ ఉన్న ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది. సాధారణ ఆహారంతో బాటు ఈ సీజన్‌లో దొరికే పండ్లు తీసుకోవాలి. ఈ జాగ్రత్తలతో పాటు క్రమం తప్పకుండా శారీరక వ్యా యామం చేయాలి. ఎటువంటి అనారోగ్యం తలెత్తినా, తక్షణమే సమీపంలో ఉన్న ఆరోగ్య కార్యకర్తను సంప్రదించి ప్రథమ చికిత్స తీసుకోవాలి. పరిస్థితిని బట్టి మెరుగైన వైద్య సహాయం పొందాలి.

### అప్రమత్తంగా ఉండాలి..

వర్షా కాలంలో అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలి. సాధ్యమైనంత వరకూ బయట దొరికే ఆహారాన్ని తీసుకోకూడదు. కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలి. పరిసరాల పరిశుభ్రత చాలా ముఖ్యం. తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. మందులకు కొరత లేదు. అన్ని విభాగాలకు వైద్యులు కూడా ఉన్నారు.

-డా.సుధీర్, సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి, చీపురుపల్లి





ప్రభుత్వ అతిథిగృహంపై పెరుగుతున్న చెట్లు

# ఇది అతిథి గృహమే!

● నిర్వహణ లేక శిథిలావస్థకు చేరిన భవనం

● మరమ్మతులకు నిధులు రాని వైనం

బొబ్బిలి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణం పార్వతీపురం స్టేట్ హైవేలో రైల్వేజంక్షన్‌ను ఆనుకుని ఉన్న ఆర్అండ్‌బీ అతిథి గృహం నిరుపయోగంగా మారింది. దీంతో ఈ భవనంపై వృక్షాలు ఏపుగా పెరిగి చిట్టడవిని తలపిస్తోంది. దీంతో ఈ గృహం పాములకు నిలయంగా మారింది. లోపలకు అడుగుపెట్టలేనంత భయంకరంగా ఆవరణ తయారైంది. జిల్లా కేంద్రంలోని అతిథి గృహం తరువాత బొబ్బిలి అతిథిగృహానికి పదిహేనేళ్ల క్రితం వరకు మంచి ఆదరణ ఉండేది. ఉమ్మడి జిల్లాలో పార్వతీపురం రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్న కాలంలో నిత్యం మంత్రులు, జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులు తరచూ బొబ్బిలి మీదుగా పార్వతీపురం వెళుతూ ఇక్కడ బస చేసే వారు. మంత్రులు, అధికారులు తరచుగా సమీక్షలు జరిపేవారు. 2014 ఎన్నికలప్పుడు కూడా ఈ అతిథి గృహంలోనే ఎన్నికల అధికారులు తమ కార్యకలాపాలు కూడా నిర్వహించారు. అలాంటి అతిథి గృహం నేడు కళా విహీనంగా మారింది. స్టేట్ హైవే పక్కన అత్యంత విలువైన స్థలంలో ఉన్న ఈ అతిథి గృహాన్ని వృథాగా వదిలేయడం పట్ల స్థానికులు ఆక్షేపణ వ్యక్తం చేస్తున్నారు. గతంలో తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు బొబ్బిలి ఆర్అండ్‌బీ అతిథి గృహంతో పాటు జిల్లాలోని పలు అతిథి గృహాలను టూరిజంశాఖకు కానీ, ప్రైవేట్ సంస్థలకు కానీ అప్పగించాలని ప్రతిపాదించారు. ఇప్పుడు ఎవరూ పట్టించుకోవడం మానేశారు. గత ఏడాది రూ.20 లక్షలతో ఈ అతిథి గృహం మరమ్మతు పనులను వారంలోగా చేపడతామని ఆర్అండ్‌బీ అధికారులు ప్రకటించారు. ఏడాది గడుస్తున్నా పనుల జాడ కనిపించలేదు. ఇదే విషయమై సంబంధిత అధికారులను అడిగితే నిధులు రాలేదన్నారు.

# ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

సీతంపేట రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో గిరిజన విద్యార్థినులు స్పోర్ట్స్ డే అక్షర క్రమంలో కూర్చొని ఆకట్టుకున్నారు. క్రీడా దినోత్సవంతో పాటు తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్ఎం వసంతలక్ష్మి, హెచ్‌డబ్ల్యూవో పి.అమల, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



స్పోర్ట్స్ డే, అ ఆ అక్షర రూపంలో కూర్చున్న విద్యార్థినులు



దోనుబాయి పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

# ఏజెన్సీలో లేఖ కలకలం

● సోషల్ మీడియాలో హల్‌చల్ ● ఎస్పీ ఆకస్మిక తనిఖీ

సీతంపేట రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలో ఓ ఆర్ఎంపీ వైద్యుడి ఆకృత్యాలపై సోషల్‌మీడియా వేదికగా 'దోనుబాయి యూత్, నూతన నక్సలిజం పార్టీ త్వరలో వస్తాం జనంలోకి' అనే పేరుతో శుక్రవారం విడుదలైన ఓ లేఖ ఏజెన్సీలో కలకలం రేపింది. దోనుబాయి ప్రాంతంలో అర్హత లేకున్నా ఆర్ఎంపీ వైద్యుడిగా చలామణి అవుతున్న వ్యక్తికి సీతంపేట రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సహకరిస్తున్నారని ఈలేఖలో పేర్కొన్నారు. చివరిలో 'ఇట్లు నూతన నక్సలిజం పార్టీ, త్వరలో వస్తాం జనంలోకి' అని రాసి ఉండడంతో పోలీసులు అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. ఈ లేఖ విడుదలైన రోజునే ఎస్పీ మాధవరెడ్డి శుక్రవారం దోనుబాయి పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేపట్టడం చర్చనీయాంశమవుతోంది. స్టేషన్‌లోని రికార్డులు, క్రైం రేటు, సీడీ ఫైల్స్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. రహదారి ప్రమాదాలు, డ్రగ్స్, సైబర్ నేరాలు వంటి వాటిపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని ఎస్పీ ఆదేశించారు. వినాయక మండపాలు ఉన్న గ్రామాల్లో ఎటువంటి అల్లర్లు తలెత్తకుండా నిఘా పెట్టాలని ఎస్‌ఐ మస్తాన్‌కు సూచించారు. అనంతరం లేఖపై ఎస్పీ ఆరాతీసినట్లు తెలిసింది. ఈ పరిశీలనలో పాలకొండ డీఎస్పీ రాంబాబు ఉన్నారు. దీనిపై దోనుబాయి ఎస్‌ఐ మస్తాన్‌ను వివరణ కోరగా.. 'మాకు ఏ లేఖ కోసం తెలియదు. వార్షిక తనిఖీలో భాగంగా ఎస్పీ దోనుబాయి పోలీస్‌స్టేషన్‌ను వచ్చారు.' అని తెలిపారు.



సాలూరు రూరల్: పుష్పక విమానంలో పంచముఖ వినాయకుడు

# ఆకట్టుకుంటున్న గణనాథులు

సాలూరు రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గణేష్ ఉత్సవాల్లో భాగంగా సాలూరు మంగళవీధిలో ఏర్పాటుచేసిన పుష్పక విమానంలో విహరిస్తున్న పంచముఖి గణనా థుడి ప్రతిమ భక్తులను ఆకట్టుకుంటున్నది. శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

● పార్వతీపురం టౌన్: కొత్తవలస పెద్దవీధిలో కొత్తపోలమ్మ యూత్ సభ్యులు ప్రతిష్ఠించిన వరసిద్ధి వినాయకుడి ప్రతిభ భక్తులను ఆకట్టుకుంటోంది.



పార్వతీపురం టౌన్: కొత్తవలసలో కొలువుదీరిన వరసిద్ధి వినాయకుడు



కమిషనర్ నల్లనయ్యకు పురస్కారం అందజేస్తున్న పర్యాటకశాఖ మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

# గిడుగు పురస్కారంతో ఆనందం

● కమిషనర్ నల్లనయ్య

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామమూర్తి పురస్కారం లభించడం తనకు మరువలేని ఆనందాన్ని ఇచ్చిందని నగర పాలక సంస్థ కమి షనర్ పల్లి నల్లనయ్య అన్నారు. శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ ఆధ్వర్యంలో విశాఖపట్టణంలోని ఉడా చిల్డ్రన్ థియేటర్స్‌లో నిర్వహించిన సభలో కమిషనర్ నల్లనయ్యకు గిడుగు రామమూర్తి పురస్కారాన్ని ప్రదానం చేశారు. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌లు నల్లనయ్యకు గిడుగు రామ మూర్తి పురస్కారంతో పాటు జ్ఞాపికను, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ తెలుగు భాషకు గొడుగు పట్టిన గిడుగు రామమూర్తి ఆశయ సాధనకు ఎందరో కృషి చేయడం అభినందనీయమన్నారు. అదే ఒరవడిలో తనవంతుగా గేయ రచనలు చేస్తూ తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్నానని తెలిపారు. ఇది గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం తనకు పురస్కారం ప్రదానం చేయడం మరువలేనిదని అన్నారు.

# వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం

నెల్లిమర్ల/ విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌లో జరుగుతున్న కామన్‌వెల్త్ దేశాల వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో నెల్లిమర్ల మండలం కొండవెలగాడ గ్రామానికి చెందిన వల్లూరు అజయ్‌బాబు బంగారు పతకం సాధించాడు. అజయ్‌బాబు ఈ పోటీల్లో 79 కిలోల కేటగిరిలో పాల్గొని స్నాచ్‌లో 152 కేజీలు, క్లీన్ అండ్ జర్క్‌లో 183 కేజీలు మొత్తం 335 కిలోల బరువు ఎత్తి బంగారు పతకం సాధించాడు. అజయ్ బాబును గ్రామ పెద్దలు దంతులూరి అజయ్‌బాబు, మొయిద సత్యనారాయణ, గదల సన్యాసినాయుడు, బంగారమ్మ, వెయిట్ లిఫ్టింగ్ అసోషియేషన్ ప్రతినిధులు బెల్లాన లక్ష్మి, చల్లా రాము, సీనియర్ క్రీడాకారుడు వల్లూరు శ్రీనివాసరావు అభినందించారు.



వల్లూరు అజయ్‌బాబు

# కొండచిలువ హతం..

సీతంపేట రూరల్,ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గొయిది గ్రామంలో గురువారం అర్ధరాత్రి 12 అడుగుల కొండచిలువ హల్‌చల్ చేసింది. గ్రామంలోని ఓ వ్యక్తి ఇంటిలో అది ప్రవేశించింది. నాటుకోళ్ల తినేందుకు ప్రయత్నిస్తున్న దాన్ని గుర్తించిన ఇంటి యజమాని కేకలు వేశారు.వెంటనే ఇరుగుపొరుగు వారు ఆ ప్రాంతానికి చేరుకుని కొండచిలువను హతమార్చారు. .

గ్రామస్థుల చేతిలో హతమైన కొండచిలువ →



# సర్కారు సీసాపై సొంత ముద్ర

● చీపురుపల్లి మద్యం వ్యాపారుల సరికొత్త పంథా

● జిల్లా అధికారులకు జనసేన ఫిర్యాదు

● తూతూ మంత్రంగా దర్యాప్తు

చీపురుపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిస్టిలరీల నుంచి సరఫరా చేసిన మద్యం సీసాలపై తమ సొంత ముద్ర (స్టాంపు) వేసి.. చీపురుపల్లిలోని మద్యం వ్యాపారులు నూతన ఒరవడికి తెర తీశారు. సొంతంగా తామే ఓ ముద్రను తయారు చేసి.. సీసాలపై ముద్రించారు. మండలంలో అనధికారికంగా నడుస్తున్న బెల్టు దుకాణాలకు వాటిని సరఫరా చేసి... వాటినే విక్రయించాలని... ఎంఆర్‌పీ కంటే పది రూపాయలు ఎక్కువ చేసి అమ్మాలని నిర్ణయించారు. చీపురుపల్లి పట్టణ పరిధిలో 8 మద్యం దుకాణాలు ఉన్నాయి. వ్యాపారులంతా ఈ మధ్య సిండికేట్‌గా మారి వ్యాపారాలు నడుపుతున్నారు. ఎంఆర్‌పీ కంటే ధరలు పెంచితే సంబంధిత దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని ప్రభుత్వం స్పష్టంగా చెప్పడంతో సరికొత్త ఎత్తుగడకు తెర తీశారు. రూ.140 ఖరీదు చేసే మద్యం సీసాలపై వారు తయారు చేసిన స్టాంపు వేసి, బెల్టు దుకాణాలకు పంపిణీ చేశారు. ఇటీవల దీనిపై జనసేన నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన ఎక్సైజ్ టాస్క్‌ఫోర్సు అధికారులు చీపురుపల్లిలో స్టాంపు (ముద్ర) వ్యవహారం జోలికి వెళ్లలేదు. మూడు బెల్టు దుకాణాలపై కేసులు నమోదు చేసి.. చేతులు దులుపుకున్నారు. సొంత ముద్రలు వేసి, వ్యవహారం నడిపిన వారిని విడిచిపెట్టడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ సీఐ చక్రవర్తి మాట్లాడుతూ బెల్టు దుకాణాలు కూడా ఎక్కడా లేవని, అక్రమంగా మద్యాన్ని రవాణా చేస్తున్న వారిపై టాస్క్‌ఫోర్స్ అధికారులు కేసులు నమోదు చేశారని తెలిపారు. సొంత ముద్రలు వేసిన ఘటనలు కూడా మండలంలో చోటుచేసుకోలేదని చెప్పారు.




వ్యాపారుల సొంత స్టాంపు ఉన్న మద్యం సీసా

# జేఎన్‌టీయూ విద్యార్థుల ప్రతిభ

విజయనగరం రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అమరావతి క్వాంటమ్ వాలీ హ్యాకథాన్ 2025లో భాగంగా జేఎన్‌టీయూ జీవీ ఇంజనీరింగు కళాశాలలో శుక్రవారం వివిధ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొత్తం 9 బృందాలు, 52 మంది విద్యార్థులు పాల్గొన్నారు. క్వాంటమ్ బ్లాక్ చైన్, మిషన్ లెర్నింగ్ ఆధారిత మోసపూరిత లావాదేవీలు గుర్తించడం, ఆప్టిమైజేషన్ స్టిమ్యూలేటర్లు లాజిస్టిక్స్ లాంటి సమస్యలకు వినూత్న పరిష్కారాలను సమర్పించారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులను అభినందించారు. సెప్టెంబరు 10న విశాఖపట్టణంలో జరిగే సెమీ ఫైనల్స్‌లో ఈ విజేతలు పాల్గొంటారని ఇన్‌ఛార్జి వైఎస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి తెలిపారు.



హ్యాకథాన్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

న్యూస్ బాక్స్

## ఒడిశా గవర్నర్‌ను కలిసిన ఎంపీ కలిశెట్టి



గవర్నర్ హరిబాబుతో ఎంపీ కలిశెట్టి

విజయనగరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబును శుక్రవారం భువనేశ్వర్‌లో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన గవర్నర్‌తో వివిధ అంశాలపై చర్చించారు.

## జాగ్రత్తలు పాటించండి

కొత్తవలస, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనాలలో తగిన జాగ్రత్తలు పాటించాలని సీఐ షణ్ముఖరావు నిర్వాహకులకు సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలకు చిన్నకుంటలతో పాటు చెరువులు కూడా పూర్తిగా నిండిపోయి ఉన్నందున నిమజ్జనం సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. నిమజ్జన సమయంలో వినాయక విగ్రహంతో పాటు ఎంత మంది వెళుతున్నారనే విషయాన్ని ముందుగా చూసుకోవాలన్నారు. చెరువులలో దిగి నిమజ్జనం చేసే వారికి తప్పని సరిగా ఈత వచ్చి ఉండాలన్నారు. చిన్న పిల్లలను తీసుకెళ్లకుండా జాగ్రత్తలు పడాలన్నారు. ఊరేగింపు సమయంలో డీజేలు, డ్యాన్స్‌లు చేసే విషయంలోను జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యుత్ వైర్లతో అప్రమత్తంగా ఉండాలన్నారు.

## ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించండి

కొత్తవలస, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గాడి అప్పారావు డిమాండ్ చేశారు. మహిళలకు బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటోలలో ప్రయాణాలు మానేశారన్నారు. ప్రతి ఆటోడ్రైవర్ అకౌంట్‌లో రూ.25 వేల చొప్పున జమ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే ఆటో డ్రైవర్లు ఆందోళన బాట పట్టారని.. తమను ఆదుకోకపోతే దీనిని ఉధృతం చేస్తామని అన్నారు.

## ఉద్యోగాలకు 237 మంది ఎంపిక

జామి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): భీమసింగిలోని ఒక ప్రైవేటు కళాశాలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించిన జాబ్‌మేళాలో వివిధ కంపెనీలలో ఉద్యోగాలకు 237మంది ఎంపికైనట్టు ప్లేస్‌మెంట్ అధికారి భాస్కర్ తెలిపారు. ఈ మేళాకు 633మంది హాజరయ్యారన్నారు.

## సమయపాలన పాటించరు

నెల్లిమర్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): సారిపల్లి గ్రామ సచివాలయ సిబ్బంది విధుల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు కొరటాన రామారావు విలేకరుల వద్ద ఆరోపించారు. గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఉదయం 11గంటల వరకు తెరవలేదని.. ఫలితంగా వివిధ పనులపై వచ్చిన గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆయన ఆరోపించారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఉన్నతాధికారులు ఎన్నిసార్లు ఆదేశించినా ఉద్యోగుల్లో మార్పు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు దృష్టికి తీసుకు వెళ్తామని రామారావు వివరించారు.

## పోలిపల్లి దేవస్థానం ధర్మకర్తగా దుర్గాప్రసాద్

రాజాం రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల భక్తుల కొంగు బంగారం శ్రీ పోలిపల్లి పైడితల్లి అమ్మవారి దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తగా వాకచర్ల దుర్గాప్రసాద్‌ను నియమిస్తూ దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎన్.సునీత ఉత్తర్వులు జారీ చేశారు. దేవస్థానంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈఓ బీవీ మాధవరావు ఈమేరకు దుర్గాప్రసాద్‌కు ఉత్తర్వులు అందజేశారు. దీంతో దుర్గాప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో డా.ఎస్వీఆర్ కళాపరిషత్ అధ్యక్షులు తులసీరావు పాల్గొన్నారు.

## డీఎస్సీ జాబితాను బహిర్గతం చేయండి

విజయనగరం రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 మార్కులు, ఎంపికైన వారి జాబితాలను బహిర్గతం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి .ఈశ్వరరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బలరాం, పైడిరాజులు కోరారు. శుక్రవారం నగరంలోని యూనియన్ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు.

# మహిళలను మహాశక్తులుగా తీర్చిదిద్దుతాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు

రాజాం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మహిళలను మహరాణులుగా, మహాశక్తివంతులుగా తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు ఆశయమని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహనరావు అన్నారు. స్త్రీశక్తి కుటమి ప్రభుత్వానికి పెద్ద అండ అని విశ్వాసం వ్యక్తం చేశారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో శుక్రవారం స్త్రీశక్తి విజయోత్సవ సభ, సూపర్ సిక్స్ హామీల సూపర్‌హిట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కోండ్రు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏడాదిలో రూ.100 కోట్లతో రోడ్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందన్నారు ఈ సమావేశంలో నిరుపేద లైన గడ్డిముడిదాంకు చెందిన నల్ల శ్రీను, బొత్స లక్ష్మం, కోడిశ గ్రామానికి చెందిన గురవాన రామినాయుడుకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ. 1.60 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు, రాజాం మార్కెట్ కమిటీ చైర్మన్ గురవాన నారాయణరావు, సుమల వెంకటమన్మథరావు, కిమిడి అశోక్‌కుమార్, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

**మంత్రి లోకేష్‌ను కలిసిన కోండ్రు..**

విశాఖపట్నంలో నిర్వహించిన ఓ కార్యక్రమానికి వచ్చిన మంత్రి లోకేష్‌ను ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ శుక్రవారం కలిశారు. రాజాం నియోజకవర్గంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. రహదారి పనులు పూర్తి చేయాలని కోరారు. టీడీపీ సీనియర్ నాయకుడు కొల్ల అప్పలనాయుడుకు విజయనగరం జిల్లా అధ్యక్షుడిగా అవకాశం కల్పించాలని కోండ్రు కోరారు. ఆయనతో పాటు కొల్ల అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

## సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం



వినతులు స్వీకరిస్తున్న బంగార్రాజు

భోగాపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు, ప్రజల నుంచి వచ్చిన వినతుల ప్రకారం ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామని మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. పోలిపల్లి గ్రామంలో శుక్రవారం 'కార్యకర్తే అధినేత' కార్యక్రమం నిర్వహించి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

**సీఎం సహాయ నిధి పంపిణీ**

నెల్లిమర్ల నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న బాధితులకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను శుక్రవారం పోలిపల్లిలో మార్క్‌ఫెడ్ చెర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అందజేశారు. పూసపాటిరేగ మండలం సీహెచ్ అగ్రహారానికి చెందిన గుడివాడ రామారావుకు రూ.76,061, వెల్దూరు గ్రామానికి చెందిన దారపు పెంటయ్యకు రూ.74,050, డెంకాడ మండలం డి.తాళ్లవలసకు చెందిన చొప్ప వరహాలకు రూ.1,28,948 విలువగల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహంతి శంకరరావు, పతివాడ విద్యాసాగర్, దంగా భూలోక తదితరులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదామును పరిశీలించిన కలెక్టర్



రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

నెల్లిమర్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదామును కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శుక్ర వారం పరిశీలించారు. నెల వారీ తనిఖీల్లో భాగంగా ఆయన గోడౌన్ సీళ్లను తనిఖీ చేశారు. రిజిస్టర్లపై సంతకం చేశారు. ఈవీఎం గోడౌన్‌పై నిరంతర నిఘా ఉండాలని సూచించారు. కట్టుదిట్టమైన భద్రత కొనసాగాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి, ఎన్నికల విభాగం జిల్లా సూపరింటెండెంట్ భాస్కరరావు, నెల్లిమర్ల తహసీల్దార్ కె.శ్రీకాంత్, డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్ జగన్నాథరావు, సిబ్బంది పాల్గొన్నారు.

**డిగ్రీ కళాశాల కోసం..**

నెల్లిమర్ల ఫ్లైఓవర్ బ్రిడ్జికి సమీపంలో ఖాళీగా ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రాజెక్టు డైరెక్టర్ భవనాన్ని కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ శుక్రవారం పరిశీలించారు. విజయనగరంలో ప్రస్తుతం అద్దె భవనంలో నడుస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్వహణ కోసం ఈ భవనాన్ని పరిశీలించారు.

## నోటీసులతో జిందాల్ మోసగించింది



నోటీసులు చూపిస్తున్న ఎమ్మెల్సీ

ఎస్.కోట రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిందాల్ కంపెనీ భూసేకరణ సమయంలో ఏ-వన్ నోటీసులు జారీ చేసేటపుడు రైతులను మోసగించిందని... దీనికి సహకరించిన అప్పటి అధికారులపై కేసులు నమోదు చేయాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2006 నుంచి ఈ పరిశ్రమకు భూసేకరణ చేశారని... అదే సమయంలో తీర్మానాలు చేశారన్నారు. భూమి ని ఇచ్చే రైతులకు ఏ-వన్ నోటీసులకు పంచాయతీ కార్యాలయాల్లో అతికించారని తెలిపారు. 15రోజుల్లో అభ్యంతరాలు తెలియజేయాలనేది దీని సారాంశమని చెప్పారు. వీటిలో ఎటువంటి వివరాలు లేవని తెలిపారు. గ్రామసభ తీర్మానాల్లో ఉన్న సర్వే నెంబర్లు కాకుండా తమకు నచ్చిన చోట రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. దీనికి సహకరించిన అప్పటి అధికారులపై చర్యలు చేపట్టాలని కోరారు. రైతుల భూములు తిరిగి వెనక్కి వచ్చేవరకు తమ పోరాటం కొనసాగుతుందన్నారు.

**జిందాల్ మోసాలు ఇవేనంటూ...**

తమ ప్రాంతంలో 18 ఏళ్ల క్రితం జిందాల్ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని చెప్పి.. ఇచ్చిన హామీలు...వాటిలో అమలు చేయనివి ఏమిటో తెలుపుతూ నిర్వాసితులు బ్యానర్లు ప్రదర్శించారు. శుక్రవారం జిందాల్ నిర్వాసితుల నిరసనలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ పాల్గొన్నారు. జిందాల్ కంపెనీ మోసగించిన తీరును వివరించారు.

## ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణ



భోగాపురం: నాయకులు, కవయిత్రుల వేషధారణలో విద్యార్థినులు

భోగాపురం, ఆగస్టు 29 (ఆంధజ్యోతి): మహారాజపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం, క్రీడా దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకొని విద్యార్థులు భువన విజయం నాటకాన్ని ప్రదర్శించారు. వివిధ రంగాల ప్రముఖుల వేషధారణలతో విద్యార్థులు అలరించారు. అనంతరం క్రీడా దినోత్సవం సందర్భంగా ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయులు పి.పార్వతీశ్వరరావు, పీడీ భవాని తదితరులు పాల్గొన్నారు.

**మెరకముడిదాంలో...**

మెరకముడిదాం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): చినబంటుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్ఎం, తెలుగు ఉపాధ్యాయులు ఆల్తి రాంబాబు ఆధ్వర్యంలో తెలుగుభాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం వివిధ వేషధారణలతో అలరించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రఘురాజు, శంకరరావు, సూర్యకుమారి, శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్త అశ్విని పాల్గొన్నారు.



మెరకముడిదాం: చిన్నారుల విచిత్ర వేషధారణ

**ఎస్.కోటలో...**

శృంగవరపుకోట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గిడుగు రామమూర్తి పంతులు జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ కేశవరావు, తెలుగు విభాగాధిపతి డాక్టర్ రేచర్ల శ్రీలక్ష్మి, అధ్యాపకులు డాక్టర్ ప్రభాకర్, ఈరన్న, భాస్కరావు, సంధ్యారాణి పాల్గొన్నారు.

**లక్కవరపుకోటలో..**

లక్కవరపుకోట, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జమ్మాదేవిపేట వద్ద గల మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో గిడుగు రామమూర్తి పంతులు జయంతి ఉత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్‌యూవీకే పాత్రో ఆధ్వర్యంలో గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ క్రీడా కారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.

## పేకాట ఆడుతూ పట్టుబడిన మహిళలు

విజయనగరం క్రైం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బాబామెట్టలో గల ఓ అపార్ట్‌మెంట్‌లో పేకాట ఆడుతున్న 8 మంది మహిళలను అదుపులోకి తీసుకున్నట్లు టూటౌన్ సీఐ పి.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేసి.. 8 మంది మహిళలను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.14,016 నగదుతో పాటు నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈమేరకు వారిపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

## విశాఖ రేంజ్‌లో సీఐల బదిలీ

విశాఖపట్నం/విజయనగరం క్రైం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): విశాఖ రేంజ్ వీఆర్‌లో ఉంటూ పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న సీఐలకు పోలీసు స్టేషన్లు కేటాయిస్తూ డీఐజీ గోపీనాథ్ జట్టి ప్రొసీడింగ్స్ జారీచేశారు. కొందరు సీఐలకు స్థానచలనం కలిగించారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న ఆర్.నీలయ్యను పార్వతీపురం మన్యం జిల్లాకు, ఆర్.సత్యనారాయణరెడ్డిను విజయనగరం జిల్లాకు, లెంక భాస్కరరావును శ్రీకాకుళం జిల్లాకు బదిలీ చేశారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న బి.రమణమూర్తిని పార్వతీపురం మన్యం జిల్లా డీఎస్ఆర్‌బీకి, ఎం.చంద్రశేఖర్‌ను విజయనగరం జిల్లా టాస్క్‌ఫోర్స్‌కు, ఇక్కడ పనిచేస్తున్న డి.బంగారుపాపను విశాఖ రేంజ్‌కు బదిలీ చేశారు. విజయనగరం జిల్లా వీఆర్‌లో ఉన్న బీవీ వెంకటేశ్వరరావును విశాఖ రేంజ్‌కు, విశాఖ రేంజ్‌లో ఉన్న ఎస్.రమేశ్‌ను విశాఖలోని సీపీఎస్‌పీకి, పార్వతీపురం మన్యం జిల్లాలో డీఎస్ఆర్‌బీలో ఉన్న పి.రంగనాథంను అదే జిల్లా రూరల్‌కు బదిలీచేసి అక్కడ ఉన్న ఎస్.గోవిందరావును రేంజ్ వీఆర్‌కు అటాచ్ చేశారు. విజయనగరం జిల్లా సోషల్ మీడియా సైబర్‌సెల్‌లో పనిచేస్తున్న బమ్మిడి శ్రీనివాసరావును అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు సీఐగా బదిలీచేసి, అక్కడ పనిచేస్తున్న పి.వెంకటరమణను అల్లూరి జిల్లా సోషల్ మీడియా సైబర్‌సెల్‌కు బదిలీ చేశారు.

## పోలీసుల ముందే ఆత్మహత్యా యత్నం

మక్కువరూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పోలీసుల ముందే ఓ మహిళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈ ఘటన డి.శిర్లాం పంచాయతీ లోవరకండి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. లోవరకండి గ్రామానికి చెందిన సాగరపు కార్తీక్ అనే యువకుడిని సాగరపు ఆదినారాయణ అనే వ్యక్తి గురువారం కత్తితో పొడిచి హత్య చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం ఈ కేసును విచారించేందుకు సాలూరు సీఐ రామకృష్ణ, మక్కువ ఎస్ఐ ఎం.వెంకటరమణ లోవరకండి గ్రామానికి వెళ్లారు. విచారణలో భాగంగా సీఐ.. ఆదినారాయణ భార్య హేమలతను పిలిచి వివరాలు అడిగారు. ఇంతలో ఆమె ఇంట్లోకి వెళ్లి పురుగు మందు తాగి, ఆతహత్యా యత్నానికి పాల్పడింది. వెంటనే సీఐ అప్రమత్తమయ్యారు. హేమలత తాగిన పురుగు మందును గ్రామపెద్దల సహాయంతో బయటకు కక్కించారు. వెంటనే మక్కువ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి బాగానే ఉంది.

## డిజిటల్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు



ఎంపీడీవో రవికుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న కార్యదర్శులు

గుర్ల, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి):నాగలవలస డిజిటల్ అసిస్టెంట్ రెల్లి శ్రీపతిపై పంచాయతీ కార్యదర్శి కల్యాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు రోజుల క్రితం పంచాయతీలో విధులు సక్రమంగా చేయడం లేదని అడగడంతో కల్యాణితో శ్రీపతి దురుసుగా మాట్లాడాడు. దీంతో మనస్థాపానికి గురైన ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎంపీడీవో రవి కుమార్‌కు కూడా ఫిర్యాదు చేశారు. మండలంలో ఉన్న గ్రామ కార్యదర్శులు అందరూ ఆమెకు మద్దతుగా పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. దీనిపై ఎస్ఐ నారాయణరావు స్పందిస్తూ డిజిటల్ అసిస్టెంట్‌ను పిలిపించి మందలించారు. ఎంపీడీవో రవికుమార్ మాట్లాడుతూ ఇకపై ఇలా ప్రవర్తిస్తే ఇబ్బందులు తప్పవని అతన్ని హెచ్చరించారు.

## బెల్టుషాపులపై దాడులు

గజపతినగరం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పిడిశీల, కాళంరాజుపేట, సీతారామపురం గ్రామాల్లో ఎక్సైజ్ సీఐ జనార్దనరావు, సిబ్బందితో బెల్టుషాపులపై శుక్రవారం దాడులు చేపట్టారు. సీతారామపురానికి చెందిన కలగర్ల సత్యారావు వద్ద 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించినా, వీటికి వేలం పాటలు వేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడులో ఎస్ఐ పి.నరేంద్రకుమార్, హెచ్.సి.బాషా, సిబ్బంది అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## మన్యంపురిపేటలో అధికారుల విచారణ

గుర్ల, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మన్యంపురిపేట గ్రామంలో గతంలో నిర్మించిన అంగన్‌వాడీ భవనానికి సంబంధించి బిల్లు అందలేదని నిర్మాణదారుడు శంకరరావు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో డీఎల్‌పీవో శిరీషరాణి, ఎంపీడీవో రవికుమార్, పంచాయతీ అధికారి అన్నపూర్ణదేవి, సిబ్బంది శుక్రవారం గ్రామానికి చేరుకున్నారు. స్థానిక సర్పంచ్ బడుగంటి హైమావతి భర్త వెంకటరమణ విచారణ స్థలానికి వెళ్లడంతో ఒక్కసారిగా గందరగోళం ఏర్పడింది. విచారణను ఆయన సెల్‌ఫోనులో రికార్డు చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని వాటిని డిలీట్ చేశారు. అంగన్‌వాడీ భవనానికి బిల్లులు చెల్లించినట్టు అధికారులు తెలిపారు. ఆ మొత్తం శంకరరావుకు అందలేదని చెప్పడంతో విచారణ చేపట్టారు. దీనిపై జిల్లా అధికారులకు నివేదిక అందించనున్నట్టు వివరించారు.



క్రైం న్యూస్

## తండ్రిని చూసేందుకు వస్తూ...

### ప్రమాదంలో గాయపడిన కుమారుడి మృతి

రాజాం రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న తన తండ్రిని చూసేందుకు విశాఖ నుంచి రాజాం వస్తూ మార్గమధ్యలో ఆటో బోల్తా పడిన సంఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. రాజాం టౌన్ సి.ఐ. కె.అశోక్‌కుమార్ అందజేసిన వివరాల ప్రకారం.... రాజాంకు చెందిన యండమూరి శ్రీనివాసరావు (40) భార్య, పిల్లలతో కలిసి విశాఖ జిల్లా గాజువాకలో ఉంటున్నారు. తన తండ్రి మాధవరావు ఆరోగ్యం బాగాలేదని తెలిసి ఈనెల 25న గాజువాక నుంచి రాజాం వస్తూ మండల పరిధిలోని బొద్దాం వద్ద ఆటో బోల్తా పడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. రాజాం సామాజిక ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేసి.. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 28న రాత్రి శ్రీనివాసరావు మృతి చెందాడు. మృతుడి భార్య యండమూరి రేజా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనివాసరావు సోదరుడు కూడా మృతి చెందాడు. ఇద్దరు కుమారులూ దూరమవడంతో మాధవరావు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

విజయనగరం క్రైం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మహిళా పోలీసు స్టేషన్‌లో 2024లో నమోదైన కేసులో నగరంలోని హుకుంపేటకు చెందిన పెంకి వివేక్‌కు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.4 వేలు జరిమానా విధిస్తూ పోక్సో ప్రత్యేక న్యాయాధికారి కె.నాగమణి శుక్రవారం తీర్పు వెల్లడించినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హుకుంపేటకు చెందిన వివేక్‌కు బాలిక, ఆమె తల్లిదండ్రులు ఓ ప్రార్థనా మందిరానికి వెళ్లే సమయంలో పరిచయమయ్యారు. బాలిక ఆరోగ్యం తరచుగా బాగాలేకపోవడంతో వివేక్ వారి ఇంటికి వెళ్లి సాయం చేసేవాడు. బాలికను ఒంటరిగా ఉంచితే ఆరోగ్యం కుదుట పడవచ్చని తల్లిదండ్రులను ఒప్పించాడు. పథకం ప్రకారం అంబటివలసలో ఒక ఇల్లు తీసి.. బాలిక ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతున్నట్టుగా వివేక్ నమ్మించాడు. బాలికతో సన్నిహితంగా ఉంటూ.. వీడియోలు, ఫొటోలు తీసి భయపెట్టాడు. ఈ విషయం బాలిక తల్లికి తెలిసి మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ పద్మావతి పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. అప్పటి డీఎస్పీ విశ్వనాథ్ నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు వివేక్‌పై నేరారోపణలు రుజువు కావడంతో న్యాయాధికారి నాగమణి అతడికి శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించినట్టు ఎస్పీ తెలిపారు. బాధితురాలికి పరిహారంగా రూ.5 లక్షలు మంజూరుచేస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారని తెలిపారు. ఏడాదిన్నర వ్యవధిలో నిందితుడికి శిక్ష పడే విధంగా చొరవ చూపిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

## రైలు ఢీకొని యువకుడి మృతి

బొండపల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గిట్టుపల్లి రైల్వే గేటు సమీపంలో శుక్రవారం రైలు ఢీకొని యువకుడు మృతి చెందాడు. బొబ్బిలి రైల్వే హెచ్‌సీ బండారు ఈశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. దత్తిరాజేరు మండలం వింధ్యవాసి గ్రామానికి చెందిన టొంపల శంకర్ (28) రైల్వే ట్రాక్ దాటుతుండగా.. విజయనగరం నుంచి బొబ్బిలి వైపు వెళుతున్న గూడ్స్ రైలు ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి తండ్రి పరశురాం, తల్లి నాగమణి, సోదరుడు హరి ఉన్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న కుమారుడు అర్థాంతరంగా తనువు చాలించడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

**పాము కాటుతో మహిళ...**

గంట్యాడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): తాటిపూడి ఆవలగల డీకేపర్తి గిరిజన గ్రామానికి చెందిన ఎర్రబోయిన కొత్తమ్మ (40) పాము కాటుకు గురై మృతి చెందారు. దీనికి సంబంధించి గంట్యాడ ఎస్ఐ సాయి కృష్ణ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం ఇంటిలో ఉన్న కొత్తమ్మను పాము కాటు వేయడంతో అక్కడికక్కడే మృతి చెందారు. దీనిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయికృష్ణ తెలిపారు.

**ద్వారకలో రాజాం మహిళ...**

రాజాం రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ద్వారకలో ఈ నెల 28న జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణానికి చెందిన అమనాన లలిత (60) మృతి చెందారు. తన భర్త నీలకంఠంతో పాటు మరికొంత మంది పారాయణం కోసం నాలుగు రోజుల క్రితం ద్వారక వెళ్లారు. ద్వారక నుంచి బెడ్ ద్వారకకు ఆటోలో బయలుదేరారు. వీరి ఆటో ఆవును ఢీకొనడంతో అందులో ఉన్న లలిత రోడ్డుపై పడిపోవడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. ఆమె భర్త నీలకంఠం రాజాంలో సిమెంట్ వ్యాపారం చేస్తున్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు. ఒకరు సౌదీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కాగా, మరో కొడుకు రాజాంలో వ్యాపారం చేస్తున్నారు.

## గంజాయితో ముగ్గురి అరెస్టు

బొండపల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): కనిమెరక రైల్వే గేటు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకొని.. 3.6 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు గజపతినగరం సీఐ జీఏవీ రమణ తెలిపారు. శుక్రవారం నిందితులను విలేకరుల ముందు హాజరుపరిచారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపాలెం గ్రామానికి చెందిన బండారు రాము, విశాఖ జిల్లా పద్మనాభం మండలం బొత్సపేటకు చెందిన జి.గణేష్‌తో పాటు ఒక మహిళను అరెస్టు చేసిన ట్లు తెలిపారు. వీరు ముగ్గురూ వినాయక ఉత్సవాల్లో అమ్మకాలు జరిపేందుకు రాయగడ నుంచి గంజాయి తీసుకు వచ్చారని వివరించారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. సీఐతోపాటు ఎస్ఐ యు.మహేష్, ట్రైనీ ఎస్ఐ పడాల్, సిబ్బంది పాల్గొన్నారు.

## తెలుగును పరిరక్షించుకోవాలి

(5వ పేజీ తరువాయి)

జారీ చేయాలన్నారు. సమయపాలన పాటిస్తూ ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండాలని ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో తహసీల్దార్లు, సర్వేయర్లు, ఇతర రెవెన్యూ సిబ్బందితో సమీక్షించారు. గ్రామస్థాయిలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం కార్యదర్శులకు అవగాహన కల్పించాలని, కలెక్టరేట్ నుంచి అందిన వాటిపై 15 రోజుల్లోగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలపై ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని, దీనిపై జాగ్రత్త వహించాలని తెలిపారు. ప్రతి కార్యాలయానికి చెందిన జీవోలు, సర్క్యులర్లు, ఉత్తర్వులు తదితర పత్రాలను ఈపీటీఎస్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో జేసీ శోభిక, సబ్ కలెక్టర్లు వైశాలి, స్వప్నిల్ జగన్నాథ్, ఎస్డీసీలు పి.ధర్మచంద్రారెడ్డి, దిలీప్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## రెండు స్టేషన్లూ కొనసాగించండి

(5వ పేజీ తరువాయి)

మధ్య ఇంటర్ సిటీ డెయిలీ సర్వీస్ నడపాలని, హైదరాబాద్, తిరుపతికి ఇక్కడి నేరుగా రైళ్లు వెళ్లేలా చూడాలని కోరారు. నర్సిపురం రైల్వేస్టేషన్‌లో దుర్గ్-విశాఖపట్నం, రాయగడ-గుంటూరు రైల్వే హాల్టింగ్ సౌకర్యం పునరుద్ధరించాలన్నారు. రిజర్వేషన్ కౌంటర్లు, రైల్వే వంతెనలపై ఆయన ప్రతిపాదనలు చేశారు. బెలగాం స్టేషన్ సమీపంలోని రైల్వేగేటును పదే పదే మూసి వేస్తుండడంతో తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని, 18 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సమావేశం దృష్టికి తెచ్చారు. ప్రజల అవసరాలు, అత్యవసర సమయాల్లో అంతరాయం లేకుండా రైల్వే వంతెన లేదా అండ్ పాసేజ్ నిర్మించాలని వినతిపత్రం అందించారు. దీనిపై ఈస్ట్‌కోస్టు రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

## సమస్యల పరిష్కారానికే గిరిజన దర్బార్



వినతులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే గిరిజన దర్బార్ అని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి పేర్కొన్నారు. శుక్రవారం గుమ్మలక్ష్మీపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆమె ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి, సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని ఆదేశించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఆదికర్మ యోగి అభియాన్‌తో గ్రామాభివృద్ధి

కొమరాడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఆదికర్మయోగి అభియాన్ పథకంలో భాగంగా ఉద్యోగులకు ఇస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎస్.రమేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రెండో రోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఆదికర్మయోగి అభియాన్ అనేది గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ నేతృత్వంలో ప్రారంభించిన ఒక ఉద్యమం అన్నారు. ఈ పథకం ద్వారా 20 లక్షల మంది గిరిజన నాయకులకు శిక్షణ ఇచ్చి, వారి నైపుణ్యాలను పెంపొందిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎంఈవో జామి నారాయణస్వామి, పంచాయతీ విస్తరణాధికారి రాధాకృష్ణ, మండల ఇంజనీరింగ్ అధికారి ఫణీస్, వైద్యాధికారి శిరీష తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలి

పార్వతీపురంటౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ మహమ్మారిపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆర్ఎంపీలపైనే ఉందని మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆసుపత్రి(విశాఖ) వైద్యులు రజనీ, మృత్యుంజయరావు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘ భవనంలో విజయనగరం, పార్వతీపురం జిల్లాల ఆర్ఎంపీలకు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల్లో ఉన్న ఆర్ఎంపీ సంఘ సభ్యులు పట్టణాలతో పాటు గ్రామాల్లో క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సింహాచలం, ఎన్.గోపాలనాయుడుతో పాటు ఉపాధ్యక్షుడు శంకరరావు, సంయుక్త కార్యదర్శి బీవీ రమణ, కోశాధికారి తులసీదాస్ పాల్గొన్నారు.

## పాలకొండను జిల్లా చేయాలి



మాట్లాడుతున్న చౌదరినాయుడు

పాలకొండ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పాలకొండను జిల్లాగా చేయాలని సధన సమితి పిలుపునిచ్చింది. సాధాన సమితి గౌరవాధ్యక్షుడు కనపాక చౌదరినాయుడు శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 32 జిల్లాల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం మంత్రుల కమిటీ వేసిందని చెప్పారు. ఆ కమిటీ శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలు వస్తుందన్నారు. కావున ఒక వినతిపత్రాన్ని ప్రసార మాధ్యమాల ద్వారా, అలాగే పోస్టుకార్డు, ఈమెయిల్ ద్వారా ఈ కమిటీకి చేరేవిధంగా ప్రతిఒక్కరూ పంపించాలని కోరుతున్నామన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

సీతంపేట రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్ఐ వై.అమ్మనరావు అన్నారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సీతంపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన రోడ్డు భద్రత, సైబర్‌నేరాలు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మితిమీరిన వేగం ప్రమాదకరమని, ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్‌ను ధరించి ప్రాణాలను రక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీ మెంబర్ సవర మాలయ్య, ఏఎస్ఐ సంజీవరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అధ్వాన రహదారితో అవస్థలు



బురదమయంగా మారిన రహదారిపై రాకపోకలు

పార్వతీపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పార్వతీపురంలో ఉన్న బూరాడ వీధి నుంచి అక్షయ పారడైజ్ మధ్య గల రహదారిపై నీరు నిల్వ ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. ఈ ప్రాంతంలో పాఠశాల ఉండడంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

## కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభం

పార్వతీపురంటౌన్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రధాన రహదారిలో చిన్న కుమ్మరి వీధి ప్రవేశ ద్వారం వద్ద ఉన్న విద్యుత్ స్తంభం కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ మధ్య కురిసిన వర్షాలకు రహదారిలో వరదనీరు నిలిచిపోవడం వల్ల విద్యుత్ స్తంభం నివాసాలపైకి ఒరిగిపోతోంది. దీంతో నివాసితులు భయాందోళనలకు గురవుతున్నారు. ● విద్యుత్ శాఖ ఏఈ దివ్యను వివరణ కోరగా స్తంభం పడిపోకుండా చర్యలు చేపడతామని తెలిపారు.



ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

# ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

● గిడుగు రామ్మూర్తికి నివాళి

తెలుగు వాడుక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి, తెలుగు భాషా దినోత్సవాన్ని విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. పలు పాఠశాలల్లో విద్యార్థినులు తెలుగుతల్లి వేషధారణలో అలరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



బొబ్బిలి రూరల్: పెంట జడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగుతల్లి వేషధారణలో విద్యార్థిని



బొబ్బిలి: పట్టణంలోని తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం



తెర్లాం: లోచర్ల ఉన్నత పాఠశాలలో తెలుగుతల్లి వేషధారణలో విద్యార్థినులు



భామిని: ఆదర్శ పాఠశాలలో విద్యార్థినుల నృత్యం

## మెనూ సక్రమంగా అమలు చేయాలి



అన్నా క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసరాజు

పార్వతీపురంటౌన్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): అన్నా క్యాంటీన్‌లో మెనూ సక్రమంగా అమలు చేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ శ్రీనివాసరాజు అన్నారు. పట్టణంలోని అన్నా క్యాంటీన్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 7.30 గంటల నుంచి 8.30 గంటల వరకు 350 మందికి అల్పాహారాన్ని, మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు 600 మందికి భోజనాన్ని, రాత్రి 7.30 గంటల నుంచి 8.30 గంటల వరకు 250 మందికి అల్పాహారాన్ని రూ.5లకే రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. సెలవు దినాలు, ఆదివారం తప్పా సోమవారం నుంచి శనివారం వరకు వివిధ రకాల మెనూలను మూడు పూటల అమలు జరిగేలా చూస్తున్నామన్నారు.

## ఎయిడ్స్‌పై అవగాహనకు క్విజ్ పోటీలు



పోటీలను పర్యవేక్షిస్తున్న నిర్వాహకులు

బెలగాం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన పెంచేందుకు విద్యార్థులకు జిల్లా స్థాయిలో రెడ్ రిబ్బన్ క్విజ్ పోటీలు నిర్వహించినట్లు జిల్లా ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి డా.టి.జగన్మోహన్ రావు తెలిపారు. శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాలలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు తదుపరి జరగనున్న మారథాన్ కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తామని చెప్పారు. అనంతరం క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికి ధ్రువపత్రాలు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రాజు, డా.రఘుకుమార్, డా.శైలజ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సిబ్బంది అమ్మినాయుడు, సంతోష్, కోటేశ్వరరావు, మణికాంత్ పాల్గొన్నారు.

## జలాశయంలో జలకళ



నిండుకుండలా పెద్దగెడ్డ జలాశయం

పాచిపెంట, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు పెద్దగెడ్డ జలాశయంలో జలకళ కనిపిస్తుంది. పెద్దగెడ్డ జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 213.8 మీటర్లు కాగా, ప్రస్తుతం నీటి మట్టం 212.01 మీటర్లు ఉంది. స్థానికంగా కురిసే వర్షాలతో పాటు రిజర్వాయర్ పైభా గాన కురిసిన వర్షాలకు జలాశయం నిండుకుండలా ఉంది. ఇన్‌ఫ్లో సెకెనుకు 50 క్యూసెక్కులు నీరు చేరగా, జలాశయం రివర్ స్లూయిస్ ద్వారా సెకెనుకు 150 క్యూసెక్కులు నీరు నదీ ప్రవాహం ద్వారా విడిచి పెడుతున్నారు. జలాశయం నీటి మట్టం మరింత పెరిగినట్లయితే ముందు జాగ్రత్త చర్యగా సైరన్ వేసి ప్రజలను అప్రమత్తం చేసి గేట్లు ఎత్తి నీరు విడిచిపెడతామని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు.

## పురోహితునివలస ఆదర్శ పాఠశాలకు క్రీడా అవార్డు

సాలూరు రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): పురోహితునివలస ఆదర్శ పాఠశాలకు క్రీడా ప్రతిభ అవార్డు-2025 లభించినట్టు ప్రిన్సిపాల్ అన్నా శ్యాముల్ లంక, పీడీ సీహెచ్.రవి శుక్రవారం తెలిపారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో పాఠశాల విద్యార్థులు చూపిన ప్రతిభకు ఈ అవార్డు లభించిందన్నారు. ఈ ఏడాది జిల్లాలో ఐదు ప్రభుత్వ పాఠశాలలకు ఈ అవార్డు ఇచ్చారని చెప్పారు. తమ పాఠశాలకు వరుసగా ఈ అవార్డు మూడోసారి లభించడం ఆనందంగా ఉందన్నారు.



అవార్డుతో పీడీ రవి

## ఎస్సీ వర్గీకరణతో దళిత జాతిపై కుట్ర

● మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు రత్నాకర్



మాట్లాడుతున్న రత్నాకర్

బెలగాం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతో దళితుల ఐక్యతను దెబ్బతీసి విభేదాలు సృష్టించేందుకు బీజేపీ, ప్రధాని మోదీ కుట్ర పన్నుతున్నారని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ఆర్.ఎస్.రత్నాకర్ ఆరోపించారు. శుక్రవారం పార్వతీపురం పట్టణంలోని రిటైర్డ్ ఎంప్లాయీస్ భవనంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. దళితులపై మోదీ పన్నిన కుట్రలో తెలుగు రాష్ట్రాల సీఎంలు భాగస్వాములుగా ఉన్నారని ఆరోపించారు. దళిత జాతిలోనే వర్గీకరణ ఉండాలా.. ఈ దేశంలో ఉన్న భూముల విషయంలో, పరిశ్రమల విషయంలో, సంపద విషయంలో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కేబినెట్ కూర్పు విషయంలో వర్గీకరణ అవసరం లేదా.. అని ఆయన ప్రశ్నించారు. తెలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల సామాజిక వర్గం ప్రజలు శాంతియుతంగా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు రేగిడి రామకృష్ణ, దుర్గాప్రసాద్, సూర్ల వెంకటరమణ, మజ్జి సతీష్, నెల్లి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్లకు అప్పీలు చేసుకోండి

గరుగుబిల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో దివ్యాంగుల పింఛన్లు పొందుతూ విచారణ నోటీసులు పొందిన వారు ఈనెల 30లోగా అప్పీలు చేసుకోవాలని ఎంపీడీవో జి.పైడితల్లి కోరారు. శుక్రవారం ఆమె మాట్లాడారు. మండలానికి సంబంధించి 371 మందికి నోటీసులు జారీ చేయగా, 270 మంది సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకున్నారని ఆమె తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి సెప్టెంబరు నెలకు సంబంధించి పింఛన్ అందిస్తామన్నారు. చేసుకోని వారికి నిలుపుదల చేస్తామని చెప్పారు. అప్పీల్ చేసుకోని వారు శనివారం ఎంపీడీవో కార్యాలయానికి తగిన సమాచారంతో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

## రికార్డుల నిర్వహణలో అలసత్వం వద్దు

గరుగుబిల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకానికి సంబంధించి రికార్డుల నిర్వహణలో అలసత్వం వహించరాదని మండల ఏపీవో మామిడి ఈశ్వరమ్మ, ఈసీ డి.తేజేశ్వరరావులు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకులతో వారు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పథక నిర్వహణకు సంబంధించి ఏడు రకాల రికార్డులను సిబ్బందికి అందించామని చెప్పారు. క్షేత్రస్థాయిలో పనుల వివరాలతో పాటు వేతనదారుల జాబ్‌కార్డులు, తదితర సమాచారాన్ని పొందుపర్చాలని సూచించారు. అధికారుల తనిఖీల్లో రికార్డులను చూపించాలన్నారు. అలాగే 19వ విడత సామాజిక తనిఖీల్లో క్షేత్ర సహాయకులకు రూ.82,567, టెక్నికల్ అసిస్టెంట్లుకు రూ.25,63,725, గతంలో ఏపీవోగా విధులు నిర్వహించిన ఎం.గౌరీనాథ్‌కు రూ.13,06,613 అపరాధ రుసుంగా చెల్లించాలని ఉన్నతాధికారులు ఆదేశించారన్నారు. మండలం మొత్తంపై రూ.60,73,991లు అవినీతి అక్రమాలు నెలకొన్నాయన్నారు.

## తెలుగు భాషాభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న పారినాయుడు

గరుగుబిల్లి, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): గత 16 ఏళ్లుగా 600 పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ తెలుగు భాష అభివృద్ధికి కృషి చేస్తున్నామని తోటపల్లికి చెందిన జట్టు సంస్థ వ్యవస్థాపకుడు డా.డి.పారినాయుడు తెలిపారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రైతులకు, విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా గత ఎనిమిదేళ్ల కిందట 18 కథల పుస్తకాలను తయారు చేశామని చెప్పారు. విద్యార్థులకు పూర్వ ప్రాథమిక పాఠశాలల నుంచి డిగ్రీ స్థాయి వరకు వ్యవసాయం, ప్రకృతి పట్ల అవగాహనకు ఆరు వాచకాలను ప్రచురించామని తెలిపారు.

## క్రీడల్లో ప్రతిభ కనబరిచిన గాయత్రికి సన్మానం



గాయత్రీని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

సాలూరు, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శుక్రవారం వేదసమాజం జడ్పీ సంస్కృతి ఉన్నత పాఠశాలలో కబడ్డీ క్రీడలో విశేష ప్రతిభ కనబరిచిన కొరంపూడి గాయత్రీని సత్కరించారు. గాయత్రీ స్వస్థలం విశాఖపట్టణం. ఈమె సౌత్ ఆఫ్రికాలో అంతర్జాతీయ బీచ్ గేమ్స్-2017లోనూ, వియాత్నంలో జరిగిన ఐదవ ఏషియన్ బీచ్ గేమ్స్-2016లోనూ, బంగ్లాదేశ్‌లో జరిగిన బీచ్ గేమ్స్-2013లోనూ కబడ్డీలో బంగారు పతకాలు సాధించారు. క్రీడల కోటాలో పోస్టల్ అసిస్టెంట్ ఉద్యోగం కూడా సాధించారు. హెచ్ఎం టి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇది రహదారే

● డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక ఎక్కడికక్కడే నిలిచిపోతున్న వర్షపునీరు

బెలగాం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం పట్టణంలో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి పలు రహదారులు చెరువుల ను తలపించాయి. ముఖ్యంగా ప్రధాన రహదారిలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడం వల్ల నీరు నిల్వఉండి చెరువులా మారిపోయింది. వాహనదా రులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వర్షం పడిన ప్రతిసారి ఇదే సమస్య ఉత్పన్నం అవుతుందని, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



చెరువును తలపిస్తున్న పార్వతీపురంలోని ప్రధాన రహదారి

## మజ్జిగౌరి ఆలయ అభివృద్ధికి భూమిపూజ

ఒడిశా

రాయగడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మజ్జిగౌరి అమ్మవారి ఆలయ అభివృద్ధికి శుక్రవారం భూమిపూజ నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కోసం గత ప్రభుత్వ హయాంలో రూ.27కోట్లు మంజూరు చేశారు. ఈ నిధుల విడుదలకు ప్రస్తుత ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి ఆమోదముద్ర వేశారు. దీంతో టెండర్లు పిలిచి, అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ నిధులతో భక్తులకు వసతిగృహాలు, ప్రసాద సేవన కేంద్రం, కేశఖండన, స్నానగదులు టాయ్‌లెట్లు, షాపింగ్ కాంప్లెక్స్ వంటి పలు కేంద్రాలను ఆధునిక హంగులతో నిర్మించనున్నట్టు ఆలయ ట్రస్టీ రాయ్‌సింగ్ బిడిక తెలిపారు.

## క్రీడలతో మానసికోల్లాసం

రాయగడ, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని కలెక్టర్ అశుతోష్ కులకర్ణి అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ఇండోర్ స్టేడియం వద్ద జిల్లా క్రీడాధికారి షేక్‌అలీనూర్ అధ్యక్షతన నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ ర్యాలీ ఇండోర్ స్టేడియం నుంచి పట్టణంలోని పలు వీధుల మీదుగా ప్రారంభ స్థలి వద్ద ముగిసింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఎన్‌సీసీ కేడెట్లు, పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## న్యూస్ బాక్స్

### 'స్త్రీ శక్తి'ని విజయవంతం చేయండి

గుమ్మలక్ష్మీపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): కురుపాం నియోజకవర్గం కేంద్రంలో శనివారం నిర్వహించనున్న స్త్రీ శక్తి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందని చెప్పారు. కూటమి నాయకులు, మహిళా సంఘాల నాయకులు పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.

### సస్పెన్షన్‌లో ఉన్న చీఫ్ ఇంజనీర్‌కు రిటైర్‌మెంట్

పార్వతీపురం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): గిరిజన ఇంజనీరింగ్ శాఖలో చీఫ్ ఇంజనీర్‌గా పనిచేస్తూ రూ.25లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీకి చిక్కిన శ్రీనివాసరావుకు సస్పెన్షన్‌లో ఉంటుండగానే రిటైర్‌మెంట్ అయినట్టు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీనికి సంబంధించి గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు.

### రైతులను ఆదుకోవాలి

కొమరాడ, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): ఏనుగుల వల్ల నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని కోటిపాం, గుంప, గదబవలస గ్రామాల్లో ఏనుగుల వల్ల నష్టపోయిన పంటలను ఆయన శుక్రవారం పరిశీలించారు. కుంకి ఏనుగులను రప్పించి, ఇక్కడ ఉన్న ఏనుగులను అడివికి గానీ జూకు గానీ తరలించాలని కోరారు.

### తెలగాడవలసలో వైద్య శిబిరం

మక్కువ రూరల్, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): మార్కొండపుట్టి పంచాయతీ తెలగాడవలస గ్రామంలో శుక్రవారం ఆంధ్ర వనవాసి కల్యాణ్ ఆశ్రమం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 160 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సంస్థ నిర్వాహకుడు దోమాన శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఎరువుల దుకాణాల తనిఖీ

పార్వతీపురం, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో ఎరువుల దుకాణాలను విజిలెన్స్ అధికారులు, వ్యవసాయాధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. స్టాక్ తోపాటు రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తనిఖీ చేస్తున్నట్టు విజిలెన్స్ ఎస్ఐ రామారావు, ఏవో అశోక్ చెప్పారు.

### తెగుళ్ల నివారణకు చర్యలు

పార్వతీపురం రూరల్, ఆగస్టు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీనారాయణపురం తదితర ప్రాంతాల్లో వరి పంటను జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్ శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి పంటకు సంబంధించి ఎటువంటి తెగుళ్లు రాకుండా ముందు జాగ్రత్తగా తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు వ్యవసాయశాఖ ద్వారా అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. వ్యవసాయ శాఖ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### రోడ్డు నిబంధనలు పాటించాలి

గరుగుబిల్లి, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): వాహనదారులు విధిగా రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ పి.రమేష్‌నాయుడు సూచించారు. శుక్రవారం సుంకి ప్రధాన రహదారి, బోటు షికారు ప్రాంతంలో వాహన తనిఖీలతో పాటు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. నిబంధనలు ధిక్కరించే వారిపై చర్యలు తప్పవన్నారు.

### నేత్రదానానికి ముందుకు రావాలి

కురుపాం, ఆగస్టు 29(ఆంధ్రజ్యోతి): నేత్రదానం చేయడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి కోరారు. శుక్రవారం కురుపాంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఆయనతో పాటు సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది, వైడీవో నెట్‌వర్క్, ట్రాన్స్‌జెండర్ అధ్యక్షురాలు గీతారాణి, గ్రామస్థులు పాల్గొన్నారు.